

# నేను - నా జ్ఞాపకాలు

## - జీడిగుంట రామచంద్రమూర్తి



*రచనా కాలం: 2019*

*(గత సంచిక తరువాయి)*

నా స్మృతి

*(70వ పుట్టిన రోజు) సాహితీ స్వర్ణోత్సవం సందర్భంగా ఫిబ్రవరి 2010లో కిన్నెర ఆర్ట్ థియేటర్స్ మరియు ఢిల్లీ తెలుగు అకాడమీ వెలువరించిన అభినందన సంచికలో ప్రచురించబడిన కొందరు ప్రముఖుల సందేశాలు, నా కుటుంబ సభ్యుల అభిప్రాయాలు*

### "He Is Very Caring"

'జీడిగుంట' కుటుంబంలోకి అందరికన్నా ఆలస్యంగా వచ్చింది నేనే. నాకు తేజాతో వివాహం జరిగి దాదాపు రెండు సంవత్సరాలవుతోంది. పెళ్ళికాగానే అమెరికా వచ్చేశాను. కానీ నెలకు మూడు నాలుగుసార్లయినా తాతయ్యతో మాట్లాడుతూనే వుంటాను.

ఎప్పుడు తాతయ్య ఫోన్‌లో మాట్లాడినా - "శ్రావణీ హేపీగా వున్నావా? తేజా బాగా చూసుకుంటున్నాడా? నీకు అమెరికా నచ్చిందా? బాగా అడ్జస్ట్ అయ్యావా? మీ అమ్మగారితోనూ, నాన్నగారితోనూ మాట్లాడుతున్నావా? బెంగపెట్టుకోవద్దు" అంటూంటారు. "మా కుటుంబంలోకి వచ్చిన అమ్మాయి ఎపుడూ, దేనికీ బాధపడకూడదు. హేపీగా వుండాలి" అని చెప్తారు.

ఇంత మంచి ఫామిలీలోకి వచ్చినందుకు 'నేను ఎంతో లక్కీ' అని ఫీలవుతున్నాను.

మీరు రాస్తున్న మీ జీవితంలోని జ్ఞాపకాల పుస్తకం మా అందరికీ మంచి ఇన్స్పిరేషన్ అవుతుందని అనుకుంటాను.

ఆల్ ది బెస్ట్ తాతయ్యా

శ్రావణి
(శివతేజ భార్య)

*అంతా దేవుని ఆజ్ఞ*

తాతయ్యా!

చిన్నప్పటినుంచీ నీతోనూ, బామ్మతోనూ వుండటం వల్ల మా అమ్మానాన్నల తర్వాత మీరే నాకు బాగా అలవాటయ్యారు. ఒకటి రెండురోజులు మీరు ఇంట్లోంచి బయటకు వెడితే ఇల్లంతా బోసిపోయినట్టనిపిస్తుంది. నువ్వు ఓ గొప్ప రచయిత కావటంవల్ల నీ దగ్గర ఏదైనా అభినందన పొందాలన్న తపనతో నాకు స్కూల్లో తెలుగు పరీక్షలో కాస్త మంచి మార్కులు వచ్చినప్పుడు గర్వంగా గర్వంగా వచ్చి ఆ పేపరు నీకు చూపిస్తే - అప్పుడు నువ్వు చిన్నగా నవ్వి "మీ స్కూల్లో కూడా ఎవరికీ తెలుగు బాగా రాదా ఏమిటీ' అంటూ ఆ పేపర్లోని తప్పులు దిద్దేవాడివి.

మామూలుగా స్కూలుకి వెళ్ళే పిల్లలకు ఇంట్లో వాళ్ళ అమ్మా, నాన్నలు పాకెట్‌మనీ ఇవ్వటం నాకు తెలుసు. కానీ నాకూ అన్నయ్యకీ, మేం పదవతరగతిలోకి వచ్చినప్పటినుంచీ ప్రతినెలా వందరూపాయలు ఇచ్చేవాడివి. ఆ వంద కాస్తా ఇంటర్‌లోకి వచ్చేసరికి నూటయాభై, తర్వాత బి.టెక్‌లోకి వచ్చేసరికి మూడు వందలైంది.

ఇకపోతే నీనించి నేర్చుకోవాల్సిన విషయాలు చాలా వున్నాయి. ముఖ్యంగా సమయపాలన, డబ్బు విలువ. వీటి గురించి తెలుసుకు తీరాలి. నేనుగానీ, అన్నయ్యగానీ ఎప్పుడైనా స్నేహితులతో బైటకు వెళితే "తిరిగి ఎన్నింటికి వస్తావు? అని అడిగేవాడివి. మేం చెప్పిన టైము దాటి పదినిమిషాలు అయిందంటే, నువ్వు మాకు ఫోన్ చేసేవాడివి. ఈ కిటుకు తెలుసుకున్న మేమిద్దరం మేం ఇంటికి తిరిగి వచ్చే సమయంకంటే ఓ అరగంట ఎక్కువేసి చెప్పటం నేర్చుకున్నాం. సారీ.

ఇక డబ్బు విషయానికొస్తే నువ్వు ఎవరికీ ఒక్క రూపాయి కూడా అప్పు పెట్టటం మాకు తెలియదు. అంతవరకూ ఎందుకూ? ఇంట్లో అందరం కలిసి ఏదైనా సినిమాకి వెళ్ళినా, ఏ హోటల్లో భోజనానికి వెళ్ళినా తిరిగి రాగానే నీదీ, బామ్మది అయిన ఖర్చు మా చేతిలో పెట్టేస్తుంటావు. "ఎందుకు తాతయ్యా?" అంటే

"నా దగ్గర ఉంది కనుక ఇస్తున్నాను. మీరు తీసుకోవాల్సిందే" అంటూంటావు. ఎవరిమీదా ఆధారపడటం నీకు ఇష్టం ఉండదు.

అపుడపుడు నేను పొరపాటు పని ఏదైనా చేసినా లేదంటే అమాయకంగా మాట్లాడినా "ఓసి నర్సమ్మా" అంటావ్. అలా మీ అమ్మని తలచుకుంటావ్. నన్నలా 'నర్సమ్మా' అని నువ్వు సంబోధించినపుడూ నాకెంతో సంతోషం కలుగుతుంది.

ఇక నీ రచనల విషయానికి వస్తే వాటి గురించి మాట్లాడేంత వయస్సూ, విశ్లేషించేటంత అనుభవం నాకు లేవు. కానీ రచనల గురించి నువ్వు నీ స్నేహితుల్తో చెప్పే సంగతి నేను రెండుమూడుసార్లు విన్నాను.

"ఏ రచన అయినా, సినిమా అయినా, నాటకం అయినా, నవలయినా, దాని క్లైమాక్స్ పాఠకుల చేత, ప్రేక్షకుల చేత కంటతడిపెట్టిస్తే ఆ రచన పండినట్టే"

నీ రచనలు చాలా వాటిలో ఆ పంట పండటాన్ని నేను గమనించాను. ఆరున్నర సంవత్సరాల క్రితం ఎపుడో నీ ఆరోగ్యం దెబ్బతిని ఆస్పత్రిలో చేరావు. తర్వాత క్షేమంగా ఇంటికి వచ్చి ఇప్పుడు మళ్ళీ రచనలు చెయ్యటం ప్రారంభించావు. నాకెంతో సంతోషంగా వుంది. మరీ ముఖ్యంగా నీ జీవిత చరిత్రను రాస్తూ 'అంతా ఆ శివుడి దయ' అనుకుంటూ నీకు ప్రాణం పోసిన ఆ డాక్టరు శివారెడ్డిగారికి ఈ పుస్తకాన్ని అంకితం ఇస్తున్నందుకు మన కుటుంబ సభ్యులంతా ఎంతో ఆనందపడుతున్నాం.

ఆల్ ది బెస్ట్ తాతయ్యా

*ఇట్లు (నీ వెంకట నర్సమ్మ) పూజాలహరి*

*(చిన్నమనుమరాలు)*

"All THE BEST"

Tatayya has always had a unique perspective on various elements of life. His input has proven to beuseful, at different moments in the past. His passion for writing has definitely brought the best out of him.

All The Best and good luck your Biography Book release function and many Happy returns of your $80^{th}$ Birthdaya.

**J. Spoorthi Rmachandra**

(మూడవ మనుమడు)

***'జీడిగుంట ' అనే ఇంటిపేరుని ఇచ్చినందుకు 'నీకు థాంక్స్ '***

డియర్ తాతయ్యా!

నాకు తెలుగు రాయటం సరిగ్గా రాకపోయినా నేను రాసే నాలుగు మాటలూ మీకు తప్పకుండా అర్ధమవుతాయని నా అభిప్రాయం.

నాకు మా నాన్నని ఇచ్చినందుకు ముందుగా నీకు ధన్యవాదాలు తెలుపుతున్నాను.

'జీడిగుంట' అనే ఇంటిపేరును ఇచ్చినందుకు ఆ దేవునికి కూడా 'థాంక్స్' చెప్పుకుంటున్నాను.

ఇంతకంటే ఇంకేం చెప్పాలి? ఇక్కడ అమెరికాలో వుంటున్న నాకు తెలుగులో బాగా మాట్లాడటం, రాయటం ఎక్కువగా రాదు. అందుకే తెలుగు అక్షరాన్ని ఇంగ్లీషులో రాసి పంపుతున్నాను.

All the best and good wishes on your $80^{th}$ Birthday and మీరు రాసిన 'జ్ఞాపకాలు' ఆవిష్కరణ సందర్భంగా... నా శుభాకాంక్షలు ... గుడ్ లక్.

*జె సమర్ధీ రాజ్యలక్ష్మణ*

*(చివరి మనుమడు)*

*(సమాప్తం)*

COMMENTS